కథానిక

# పాండురంగ మాహాత్మ్యము

అవసరాల రామకృష్ణకవి

పెళ్లివారింట్లో అందరూ గొల్లుమన్నారు. అందరికీ ఆత్రుతేగాని అసలు సంగతి ఎవరికీ బోధపడలేదు. పెళ్ళికూతురు తండ్రి శంకరంగారి మాటలుమాత్రం వినపడుతున్నాయి. "పెళ్లి అనేది వచ్చేసరికి యీ ఆడకూతుళ్ళకి ఒంటిమీద తెలివుండదు. కలిసిపోయిన పేకముక్కల్లా ఎవరెక్కడుంటారో తెలీదు. మీ అమ్మేదే?" తండ్రి కంఠంగా రెందుకో అమ్మడికి బోధపడలేదు. ఇంతట్లో వరాలమ్మ రానేవచ్చింది.

"ఏమిటండీ ఎందుకా కేకలు?"

"కేకలా మరీ కేకలా? పాతిక కాసుల పలకసర్లూ మటుమాయమైపోతే నోరు మూసుకు కూర్చోమన్నావా ఏమిటి?"

అమ్మడూ వరాలమ్మా ఖంగారుగా వెంకట్రమణ గదిలోకి వెళ్ళేరు. దాని మెళ్ళో పలకసర్లు లేవు. కళ్ళనీళ్ళెట్టుకు అదలా కూర్చుంది. వరాలమ్మకి గుండెల్లేవు.

"అదేమిటే నా తల్లీ? నిన్న దీపాలుపెట్టేవేళ నీమెళ్లో పలకసర్లుచూశాను, ఇంతలో ఏమైందే?" వెంకట్రమణ మాటాడలేదు. శంకరంగారు అక్కడికి రానేవచ్చారు. "చిన్నముండ ఏడుస్తేమాత్రం కాస్త ముందూవెనకా ఆలోచించవద్దూ? పోనీ మెళ్ళోవేసింది కాస్త ఆ కుర్రకుంక కన్నుమయ్యగానే తీసెయ్యవద్దూ? ఆహారవ్యవహారాలపట్ల అంత అశ్రద్ధా? ఎవరైనా తీసుకున్నారంటే వారిదా తప్పు? పోనీ పిల్లలవంటిది నగలేవున్నాయోఏమున్నాయో పెద్దదానివికదా కాస్త నువ్వు చూసుకోవద్దూ?"

"అవునండీ, అన్ని తప్పులూ నావే! అయిదు రోజులయింది సరిగ్గానిద్రపోయి ఒళ్ళంతా పచ్చిపుండులావుంది. ఏదో పోరులేకుండా చేసుకు వచ్చాను పెళ్ళి. ఆ బడలికమీద నిన్నరాత్రి కాస్త ఒరిగేనేమో! అదే తప్పయింది. పోనీ యిన్నంటూరుకదా మీరే కొంచం తీరిక చేసుకుని మంచీ చెడ్డా వాకబుచెయ్యకూడదూ?" అమ్మడు కార్యవాది. పోయినవస్తువుకోసం ప్రయత్నం చెయ్యకుండా వ్యర్థసంభాషణకు అది సహించలేకపోయింది. వెంకట్రమణని పిలిచి ఆరాలుతీసింది. గడచినరాత్రి పాపాయి అక్కయ్య పలకసర్లు కావాలని ఏడ్చిందిట. దాని మెళ్ళోవేసి తియ్యడం మరిచిపోయిందిట. తెల్లారేసరికి లేదుట. వెంకట్రమణ పక్క ఎవరు ఎత్తారో, ఆవాళ ఆ గది ఎవరు ఊడ్చేరో అన్నీ కనుక్కున్నారు. పాపాయిని ఎన్ని ప్రశ్నలోవేశారు. దుక్కంత నగ ఎక్కడపోయినట్టు?

"అన్నీ సవ్యంగా జరిగాయని ఎంతో మురిసిపోయాను. నా మొహానికి అంత అదృష్టమా?" అంది వరాలమ్మగారు.

"ఇలా కాళ్లు జాపుకుకూర్చుంటే ఎలాగర్రా? చేసేదేదో చెయ్యాలిగాని! తెల్లారగట్ల ఎర్రమ్మ గది తుడిచిందన్నారు. దాని పనేమో యిది?" అన్నారొకరు.

"ఛా! ఎంతమాట! పదేళ్ళబట్టి ఉంది, అది అలాటిదికాదుసుమండీ, బంగారం అక్కడపెడితే ముట్టుకోదు."

"అయితే ఎవరు తీశారంటారు మరి?"

"అన్నీ వెతికాం. చూడవలసిన అన్నిచోట్లా చూశాం. అయినా మన రోజులు బాగులేవు. ఒకటా? రెండా? పాతికకాసుల నగ! చేతులారా అర్పించింది. దాన్ని ఏడిపించి ఏంలాభం, శుభమా అని పెళ్ళిచేసుకుంది!"

"జరిగిందేదో జరిగింది, లేవండి భోజనాలకి వంట బ్రాహ్మణులు పిలుస్తున్నారు!" శంకరంగారు వరాలమ్మని కాస్త పక్కగా పిలిచారు.

"ఇంకా ఎందుకే వంటవాళ్లూ? నిన్నే పంపి చేస్తానన్నావుకదుటే?"

"బాగుందండీ అక్కడికి నేఖర్చు పెట్టేదాన్ని మీరుకూడ బెట్టేవారూనా? నిన్న సాయంత్రం సాయంత్రం ఇద్దర్ని పంపేశాను. ఇంకాఅందరూ ఉన్నారుకదా అని యిద్దర్ని ఉంచేశాను."

ఈ మాటవిన్న పక్కనున్న ముసలావిడ ఒకర్తె అడిగింది.

"వంట బ్రాహ్మణులూ అదీ అంటే జ్ఞాపక మొచ్చిందీ, సుబ్బమ్మంటూరూ ఆవిడ యిక్కడ పెళ్ళివంట కొచ్చిందా?"

"బాగుందమ్మా, 'కొంరిలేని కషాయమా?' ఆవిడ లేకుండానా?"

"ఇంకేం? ఆవిడ పనే యిది! మొన్న మా ఆడపడుచు సవితికూతురు పెళ్ళైతేనూ, యిది అక్కడ వంటకొచ్చినట్టే వచ్చి నాగరం కత్తిరించుకుంది!" అందరూ యీ పని సుబ్బమ్మదే అని తీర్మానించారు.

"సాయిత్రం వెళ్ళినట్టేవెళ్లి తెల్లారేసరికి జీతానికొచ్చిందమ్మోవ్, నాకేం తెలుసు యింతపని చేస్తుందని!"

ముసిలావిడ వరహాకిమ్మత్తుచేసే సలహాఇచ్చింది.

"చూడండి పంతులుగారూ, యింక మీరు ఆలశ్యంచేసి లాభంలేదు. ఇద్దరు పోలీసుల్ని తీసుకుని వెంటనే దానియింటికి వెళ్ళండి."

* * *

తలుపు టకటకలాడింది. సత్యం గుండె దడదడలాడింది.

"పెరిటితలుపు తీసేవుంది, పద సుబ్బులూ" అన్నాడు మెల్లిగా. సుబ్బమ్మమాత్రం గట్టిగా అవతలవాళ్ళకి వినపడేలా జవాబు యిచ్చింది.

"ఎక్కడికి సత్యం అన్నయ్యా, ఎందుకు పారిపోడం? మనిషి పల్లెనుంచి పట్నంనుంచి పారిపోగలడుగాని సత్యంనుంచి ధర్మంనుంలి పారిపోగలడా? లోటులేనివాడికి మరోచోటు దేనికి?"

సత్యం ఆశ్చర్యంగా చూస్తూండగా సుబ్బమ్మ తలుపుతీసింది.

"శంకరం బాబుగారు! ఏమిలావచ్చారు? వెంకట్రమణగార్ని వాళ్ళొచ్చి తీసుకెళ్ళేరా?"

శంకరంగారికి చాలా ఆశ్చర్యమేసింది. ఏమిటీ మనిషి? తొణకదు, బెణకదు, దీన్ని దొంగని ఎలా అనుకోడం? అయినా ధైర్యం తెచ్చుకుని అన్నారు.

"చూడు సుబ్బమ్మా, మా క్షేమం తర్వాత వాకబు చేద్దువుగాని నీ క్షేమం కావలిస్తే ముందు నువ్వు తీసిన నగ యిలా యిచ్చెయ్."

సుబ్బమ్మ మొహంలో అనేక రంగులో మారేయి. ఓ గడీ ఊరుకుని అంది.

"నగా? పోయిందా? నే తీసేనా? అంత తొందరపడకండి అయ్యగారూ."

"అవును నగే! వెంకట్రమణ పలకసర్లు. నువ్వే తీశావు. అట్టే అల్లరిచెయ్యకుండా యిచ్చేస్తే పోలీసులకి కబురుచెయ్యను."

"ఇదిగో చూడండి బాబుగారూ! మీ మొహంచూసి యింతసేపూ ఏమన్నా ఊరుకున్నాను. ఇంక ఊరుకోలేను. ఎక్కడా పూచిక పుల్ల ముట్టుకున్నానన్న మాట అనిపించుకోలేదు. అలాంటిది యీవాళ పొద్దుట లేచి ఎవరిమొహం చూశానో మీచేత యింత మాటపడ్డాను" ఆవిడ కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయాయి.

"నేనూ యింతసేపూ నీ మొహంచూసే దిక్కులేని దానిని నిన్ను అల్లరిపెట్టడ మెందుకని ఊరుకున్నాను. నువ్వు మాటలతో లొంగేదానివి కాదుగనుక పోలీసుల్ని పిలవక తప్పడంలేదు. వాళ్లు కూడానేవున్నారు. ఆఖరుసారి అడుగుతున్నాను. ఇస్తావా, సరేసరి లేకపోతే."

ఈ హడావిడికి ఆ చుట్టుపట్ల వారందరూ అక్కడ చేరుకున్నారు. ఇంటి అవతల నుంచున్న పోలీసులు కూడా వచ్చారు. సత్యం అన్నాడు:

"చూడండి బాబుగారూ! ఈ సుబ్బమ్మగార్ని నేను ఎంతకాలంనుంచో ఎరుగుదును. ప్రొద్దుట లేచి సూర్యోపాసన అవుతేగాని పచ్చి మంచి నీళ్లు తాగి ఎరగదు. పాండురంగడిని మడిగట్టుకు దర్శిస్తేగాని మనలో కలవదు. ఇన్నాళ్ళయి చూస్తున్నాను, ఆవిడ ఇలాంటి పనిచేసిందంటే."

"ఆగవయ్యా అక్కడికి ఆగు. నిన్నెవడు అడిగాడు? ఏమమ్మా సుబ్బమ్మా ఏమంటావు? తీసిన నగ యిచ్చేస్తావా, లేకపోతే మేంచేసేది చెయ్యమన్నావా?" శంకరంగారు గద్దించే అడిగారు. సుబ్బమ్మ ఏం చెప్తుందోనని అక్కడ మూగిన అమ్మలక్కలందరూ ఆత్రుతగా వింటున్నారు. సుబ్బమ్మగారు జీవనదిలా ప్రవహిస్తున్న కన్నీళ్లు తుడుచుకుంటూ "అయితే పలకసర్లు

నేనే తీశానని మీ స్థిరనిశ్చయమా?” అని శంకరం గారి కళ్ళలోకి సూటిగా చూస్తూ ప్రశించింది. ఆ తీక్షణమయిన చూపు ఆయన భరించలేక చూపు మరల్చి 'అవును' అన్నాడు గట్టిగా.

“సరే, మీరు పెద్దలు. మీలాంటివారు ఒక నిర్ణయానికివస్తే మాలాంటి బీదవాళ్లు చేసేదేమీ లేదు. మాలాంటివాళ్ళని దీనదయాళుడైన ఆ పాండురంగడే చూడాలి. నేనే పలకసర్లు తీశానంటున్నారు కదూ! సరే ఆ ఉద్దేశంమీదే ఉండండి. పలకసర్లు సుమారు రెండువేలు చేస్తుందనుకుంటాను. నాలాంటి బీదదాన్ని అంతసొమ్ము యిమ్మంటే యివ్వలేదు. అయినా సత్యాసత్యాల విషమపరీక్ష వచ్చినప్పుడు దేనికయినా తెగించాలి. నాకు ఉన్నదీ మిగిలిందీ ఈ చిన్న యిల్లు ఒకటే. దీని అమ్మకానికి తారేమోనని అప్పుడే మనుషులు తిరుగుతున్నారు. అవసరమొచ్చిందికాబట్టి ఒకటి రెండురోజుల్లో అమ్మేస్తాను. వచ్చే శనివారం ముక్కోటి ఏకాశి, మహాపుణ్యకాలం. ఆనాటికి తెలయినా తాకట్టుపెట్టి సొమ్ము సమకూరుస్తాను. చుట్టూ ఉన్న పెద్దమనుషులందరూ ఈమాటల్ని జాగ్రత్తగా వినమని నా ప్రార్థన. పొద్దుటే లేచి గోదావరిలో స్నానంచేసి ఆమడిబట్టతో చేతిలో డబ్బుతో పాండురంగడి గుళ్ళోకి వస్తాను. దేముడికి దండంపెట్టి ఆయన కాళ్లమీద సొమ్ము గుమ్మరిస్తాను. ఆవునేతి దీపారాధనచేసి యివతలికి వచ్చేస్తాను. వింటున్నారా బాబుగారూ? తమరానాటికి అక్కడికి దయచేసి ఆ దీపం ఆర్పేసి ఆ సొమ్ము తీసుకోమని నా మనవి. ఆ తరువాత సత్యాసత్యాలు, న్యాయాన్యాయాలు ఆ పాండురంగడే నిర్ణయిస్తాడు!” శంకరంగారి గొంతుకలో పచ్చివెలక్కాయ పడింది. సుబ్బమ్మ ఎన్ని మాటలన్నా ఆపాండురంగడి పేరెత్తకపోతే బాగుండును. ఆయన స్వతహా వైష్ణవభక్తుడు. పాండురంగభక్తి విద్యుత్తులా ఒళ్ళంతా ప్రవహించి ఆయన గజగజలాడిపోయాడు.

“పిల్లాడికి ఒంట్లో సరిగా లేదని మా యింటివి రంగడికి ముడుపు కట్టింది. ఆయనకి ఆగ్రహమొస్తే బతగ్గలమా? మనకెందుకు పదరా వెంకా” పోలీసులిద్దరూ కళ్ళు మూసుకుని యింటిదారి పట్టారు “మాయదారి నగ పోతేపోయింది, మరి ఒకటి చేయించుకోవచ్చు. ఇంతకీ మనకి నిజం తెలీదుగదా, ఎందుకుచెప్పండి దేముడిముందుబట్లూ సత్యాలూ?” వరాలమ్మ ప్రబోధించినట్టయింది.

“ఏం బాబుగారూ, ముక్కోటినాడు వస్తారా?” సుబ్బమ్మ ధైర్యంగా అడిగింది. శంకరంగారు మాట్లాడలేదు. ఒక్కసారి లేచి అందరూ మాస్తూండగా యింటివైపు గబగబానడచి వెళ్ళిపోయాడు. సుబ్బమ్మగార్ని శ్లాఘిస్తూ అందరూ వెళ్ళిపోయారు. సత్యం గదితలుపు వేశాడు.

“అయితే నువ్వు నిజంగా పలకసర్లు తియ్యలేదు టే?” అని అడిగాడు. సుబ్బమ్మ చూరులో దాచిన పొట్లంతీసి మెళ్లో అలంకరించుని “నేనెలా ఉన్నాను?” అని అడిగింది. సత్యం కళ్లు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.


# రొమ్ము దగ్గు




దగ్గులు, జలుబులు, గొంతు పుండ్లు, బ్రాంకైటిస్, ఇన్ఫ్లుయెంజా మున్నగునవి ప్రమాదకరమైనవే-శ్వాస విరోధాలన్నిటినీ పెప్స్‌తో తొలగించండి. పెప్స్ ఉచ్ఛ్వాస నిశ్వాసాలను సులభతరమొనర్చుతుంది. పెప్స్‌లోని అమూల్యమైన ఔషధ సారములు రొమ్ము, ఊపిరి తిత్తుల అంతర్భాగాలలోనికి చొరబడుతాయి. అందువల్లనే పెప్స్ సత్వరంగా దగ్గులను నివారించి, మంటను అరికట్టుతుంది హానికరమైన క్రిములను సంహరించి, ఊపిరితిత్తులకు, గొంతుకకు, బాధోపశమనం కలిగిస్తుంది. పెప్స్-వాడవలసిందని వైద్యులు సిఫారసు చేస్తారు.



పెప్స్ సేవించండి.

**PEPS**

క్రిమి సంహారకరమైన గొంతు, రొమ్ము బిళ్లలు.

FPY-22-TEL


దాని ఆకర్షణలోని అసలుకిటుకేమిటో తెలిసిపోయాక, ఏ మతప్రభావమైనా క్షీణించక తప్పదు.—జాన్ మార్లే